5249
శ్రీకాకుళం





# అభినేత్రి

''యాక్టర్, యాక్ట్రెస్ అంటే మంచి తెలుగు పదాలు కావాలి మేడమ్'' స్టేట్స్ నించి వుపకారవేతనం పొంది, ఓరియంటల్ లాంగ్వేజెస్ చదవటానికి వచ్చిన విద్యార్థి జోజెఫ్ అడిగాడు. అతను అమెరికనే. హిగ్గిన్స్ అనే అతను స్కాలర్‌షిప్ మీద అమెరికా నించి ఇండియా వచ్చి తమిళనాడులో వుండి కర్ణాటక సంగీతం నేర్చాడు మూడేళ్లలో. భాగవతార్ అనిపించుకోవాలని మరొక యాడాది వేతనం కావాలంటే శాంక్షన్ కాలేదు. డిప్లొమా వచ్చేది. అయితేనేం రికార్డ్సు యిచ్చాడు. స్వదేశం వెళ్లిపోయాడు. అది తెలిసే జోజెఫ్ వచ్చాడు. తెలుగు నేరుస్తున్నాడు గానీ సరిగా పలకటం రాలేదు. ''రండి'' అనటానికి ''రొండి, రాండి'' అంటూ తిరగటి రాయి పిడిపట్టుకు తిప్పినట్టు చేయి తిప్పుతాడు. పట్టుదల వున్నది. సరిగా తెలిసేదాకా అడిగి తెలుసుకుంటాడు. బ్రౌన్ దొర అధికార హోదాలో ఇండియాలో వున్నప్పుడు తెలుగు నేర్చి, భారతం, భాగవతం, వేమన పద్యాలూ చదివాడు. వేమన పద్యాలు సంకలనం చేసి గ్రంథస్తం చేసింది దొరే. అప్పుడు పాఠ్యపుస్తకాల్లో వాడుక భాషే వుండాలనీ, పరీక్షలకు జవాబులు వాడుకభాషలో వ్రాయవచ్చనీ, సున్నాలు అరసున్నలు బండిరాలు తీసేయాలనీ వుద్యమం నడుస్తున్నది. కొంతమందికిది నచ్చక, దొరతో చెప్పి, ఆ వుద్యమం అణిచి వేయాలనీ, గ్రాంధిక భాషే బోధనలో వుండాలనీ భాషను చులకన చేస్తున్నారని చెప్పుకోటానికి దొర దగ్గరకి వెళ్లి, ''పాండుక్ష్మా భూపాలుడు నిన్నుజూపి చనియె మహాత్మా!'' అని చదివారు. అవి పాండవులు కృష్ణునితో అన్నమాటలని దొరకి తెలుసు. వారి అజ్ఞానానికీ, మూర్ఖత్వానికీ నవ్వి మంచి చెప్పి పంపాడు. వాడుక భాషే వ్యాప్తిలోకి వచ్చింది.

గైడ్ పేరు సుమతి. ఆచార్య బిరుదున్నది. ఉత్తమ ఉపాధ్యాయిని బిరుదు కూడా బహూకరింపబడింది. తెలుగునాటక కళ మీద పరిశోధన చేస్తున్నది. తెలుగు విభాగం అధికారి అయింది.

''నటుడు, నటీ, నటీమణి'' అన్నది తలెత్తకుండానే.

''మణి యెందుకు మేడమ్. జెమ్ అని లేదే?''

సుమతి తలెత్తింది. తెలివివున్నదే అన్నట్టు చూసింది.

''బెస్ట్ యాక్ట్రెస్ అని లేదే?''

''నటి అంటేనే కృతకంగా, లేనిది వున్నట్టు చూపుతుంది. కోపం చూపుతుంది గాని నిజంగా కోపం లేదు. అది చూసినవారు నిజంగా కోపమొచ్చిందనుకుంటారు. ప్రేమా అంతే. ప్రేమా అభినయిస్తుంది''.

''అంత బాగా చూపితేనే డబ్బు వూడిపడుతుంది మేడమ్. బుక్ చేస్తారు నిర్మాతలు'' హాస్యమాడాడు జోజీఫ్.

'' ఇంకేం తెలియటంలేదూ! డబ్బు వూడిపడాలనే అభినేత్రి అభినయం పడుతుంది'' అని మళ్లా పుస్తకం చూస్తున్నది గైడు.

''అంత సహజంగా అభినయించే వారిని కలుసుకోగలమా మేడమ్''? అడిగాడు జోజీఫ్.

''వెరీ యీజీ. అభినేత్రి అంబుజమ్మ వున్నది. ఆమె అభినయం చూసి మీరు నిజమనుకుంటారు. చూపిస్తా కలుసుకుందాం''.

''చాలా సంతోషం మేడమ్. దొరసానీ అనాలా మేడమ్ బదులు?''

తలెత్తి చూసి మొహం చిట్లించింది సుమతి ''నేనే దొరకీ సానినిగాను'' అన్నది.

''సాని అని వాడితే తప్పా మేడమ్? అదెట్లా యేర్పడిందసలు? యెందుకు తప్పుడర్థం వచ్చింది?'' అన్నాడు నవ్వుతూ.

''దేవుని కోసం ఒకమ్మాయిని పవిత్రంగా పెంచి దేవుని సేవకు అట్టిపెట్టేవారు. షోడశి, భైరవి, బసివి, గణాచారి అని పేర్లు పెట్టేవారు. ఆమె దేవుని ప్రాపర్టీ గనక, భవిష్యత్ చెప్తుంది గనక దణ్ణం పెడితే దీవిస్తుంది. పవిత్ర జీవి గనక స్వామిని అనేవారు. పాదాభివందనం చేసి, పాద ధూళి నెత్తిన చల్లుకునే వారు. పోను పోను రక్షణ, గురీ, గౌరవం తగ్గిపోయి, దేవుని ప్రాపర్టీ పబ్లిక్ ప్రాపర్టీ అయి ''మి'' తీసేస్తే, సాని అయింది. అంటే పబ్లిక్ ప్రాపర్టీ అనే అర్థం స్థిరపడింది. అట్టి ఆచారము లేదు. పవరూ లేదు''.

''మేమూ మీటౌతాము మేడమ్'' అన్నాడు మరొక స్కాలర్.

''తప్పు తప్పు. మేమూ ఆ అభినేత్రిని చూస్తాము అనాలి మిత్రమా'' అన్నాడు మరొకడు. అంతా నవ్వుతూ లేచారు.

2

''చూచి పోదామని వచ్చానత్తయ్యా. శాన్నాళ్లయింది నిన్ను చూసి. వూళ్లో వున్నావని కూతురింటి కొచ్చావనీ చెప్పారు బంధువులు. వీళ్లు నా స్టూడెంట్సు. తెలుగు నేర్చుకోటానికి స్కాలర్‌షిప్ మీద మనదేశం వచ్చారు. నన్ను గైడ్‌గా

పెట్టుకున్నారు. యమ్‌ఫిల్, పిహెచ్‌డి చేస్తున్నారు. స్కాలర్‌షిప్ అయిపోకముందే డిగ్రీ తెచ్చుకోవాలి. హిగ్గిన్స్ భాగవతార్ పేరు విన్నావు. ఆయన్ని చూశావు. డిప్లొమా కోసం వచ్చాడు. మద్రాసులో చూశావు గుర్తుందా? పోతాం అత్తయ్యా. మీరేదో సందడిలో వున్నారే. నలుగుర్నీ కలుసుకుని మాట్లాడుతుంటే మంచి తెలుగు అలవడుతుందని, కలుసుకోటానికి వచ్చారు'' అన్నది సుమతి.

చింకి చాటంత మొహంతో అన్నది కామేశ్వరమ్మ.

''వెళ్లటమెందుకే అమ్మన్నా! సమయానికే వచ్చావు. వొయ్యాయి కుసుమ కూతురుకి అన్నప్రాశన చేస్తున్నాం. పిల్ల జబ్బుపడి ప్రాణావశిష్టమైతే, అన్నం ముట్టిస్తే కోలుకుంటుందని తెలియజెప్పి, అన్నీ సిద్ధం చేసేశా. ఇవాళ మంచి రోజు. పురోహితుడు పిచ్చయ్యకి ఫోన్ చేశాను. కార్యక్రమం అంతా శాస్త్రీయంగా చేస్తాననీ వస్తాననీ మాటిచ్చాడు. వీళ్లు విదేశీయులు. ఔనా? మన పండగలూ, ఆచారాలు, తంతులు చూసి ఆనందిస్తారు. నా ఆడబడుచు కూతురు స్టేట్స్ నించి వస్తుంటే ఆమె సఖి గూడా వచ్చింది. వేదపఠనం జరుగుతుంటే రికార్డు చేసింది. ఫొటోలు తీసింది. పే చేసింది'' అని ఆపేసింది.

కార్యక్రమం సహపడా ఔతుండగా కుసుమ భర్త భైరవ్ వచ్చాడు. యేం జరుగుతున్నదీ చూశాడు. నిలబడే ధాష్టీకంగా అన్నాడు.

''కుసుమా! యిటువంటి ఆచారాలన్నీ చేయరాదని చెప్పానే! అదంతా డబ్బు గుంజటానికి, ఖర్చు చేయించటానికీ చేయిస్తారని చెప్పానే! మా అన్నయ్యను కిందబెట్టారు. నువ్వు సంబరం చేస్తున్నావా? నీ కూతురుకి ఇన్‌ఫెక్షన్ అని డాక్టరు చెప్పాడుగా. మెల్లిగా తగ్గుతుంది మూడు నెలలు పడుతుంది

తగ్గటానికన్నాడుగా. మధ్యలో సంబరం చేసినా అంతే. నా చెల్లి కొడుక్కి ఆరో యేడు. వూపింగ్ కఫ్ పట్టుకున్నది. అదీ మూడు నెలలు పీడిస్తుందట. మా చెల్లి గ్రహపీడ వదలటానికి, హోమమూ, శాంతీ అని చేయటం లేదే. నీ దగ్గరున్నదంతా లాగేదాకా యేదో చేయిస్తూనే వుంటారు. స్టుపిడ్! గ్రహించలేవూ?'' వెళ్లిపోబోయాడు. కూచోనన్నాలేదు.

అత్త కామేశ్వరమ్మ ముసుగు సవరించుకుంటూ, ముక్కు పీక్కుంటూ నవ్వుతూ సరసమాడింది. ''మీ వాళ్లన్ని రకాల సంబరాలూ చేసుకోటం లేదూ! లేనివాళ్లమని లోకువ. వంటైంది. భోజనం చేసివెళ్లు. వడ్డించేస్తున్నా. పరమాన్నం నోటికి రాయగానే, బావమరిది బట్టలు పెట్టాలి. పై బట్ట కొంగుతో పిల్ల నోరు తుడుస్తాడు. వెండి పళ్లెం కొని తెచ్చా. తామరాకు దానిలో కొత్త గౌను పెట్టి పిల్లకివ్వాలి. వెండిమర్రాకులో పరమాన్నముంచి పిల్లనోటికి రాయమని బావమరిదికివ్వాలి. బంగారు వుంగరం ముంచి పరమాన్నం పిల్ల నోటికి తాకించాలి. వుంగరం తాకట్టు విడిపించి తెచ్చాను. మీ దగ్గర సమయానికి డబ్బుండదని అన్నీ నేనే సమకూర్చా'' అంటున్నది వూగుతూ.

''దానికి యేడో నెలే. పళ్లు రాలేదు. ఇప్పుడేం పరమాన్నం. పదో నెల రావాలి. పళ్లూ రావాలి'' అన్నాడల్లుడు.

'' ఆడపిల్లకు సరినెలల్లో అన్నం ముట్టించరాదు. పిల్ల తొమ్మిదో నెలలోనే పుట్టింది'' అని నవ్వుతున్నది అత్తగారు.

''శాస్త్రం ఆచారాల పేరిట డబ్బూ గుడ్డలూ లాగమంటున్నది. అట్లా చూసినా తొమ్మిదో నెలలో చేయాలి ప్రాశన. ఇంకా రెండు నెలలాగాలి'' అన్నాడు కరుగ్గా. విసుగెత్తినట్టు చూశాడు.

''నాకు తీరికేదీ? మంచి ముహూర్తముండద్దూ! చూసి పోదామని వచ్చాను. మంచి ముహూర్తమందింది. పండుగ జేసిపోతా'' అన్నది అత్తగారు.

కుసుమ వచ్చి భైరవ్ చెయ్యిపట్టుకున్నది. ''వెళ్లకండి. వద్దని మొత్తుకుంటుంటే వినకుండా మొదలెట్టేసింది. పిల్ల బతికి బట్టగడితే చాలని చెప్పా. కసిరికొట్టింది. విదిలించింది. నీ తెలివి తెల్లవారా! మగనిని వంచలేవుటే, అని నోరు చేసుకుంటే నా నోరు పడిపోయింది''.

భైరవ్గూ కుసువును విదిలించి కొట్టాడు. ''నాకు బదిలీ అవుతుందంటున్నారు తోటి ఆఫీసర్లు. అదే నిజమైతే ఆ వూరెళ్లి ఛార్జ్ తీసుకుని యిల్లు వెతకాలి నీ కోసం నీ పిల్లలకోసం. అక్కడికూ్కడా వచ్చి మీ అమ్మ యేదో మిషపెట్టి నీ జేబు ఖాళీ చేయద్దూ'' వెళ్లిపోయాడు.

కార్యక్రమం వినోదమిచ్చింది. ఒక పీటమీద పట్టు చీరవేసి, ఆట బొమ్మ బంగారు గొలుసు, పుస్తకం, పెన్నూ వుంచి పాపను పారాడే పొజిషన్లో వుంచి, ''నీక్కావాల్సింది తీసుకో చిట్టి తల్లీ'' అన్నదమ్మమ్మ.

పెన్ను తీసుకుని నోటికానించుకున్నది చిట్టితల్లి.

''చదువుల తల్లి అవుతుంది చిట్టి'' అన్నాడు మేనమామ నరహరి.

బహుమానాలు చాలా వచ్చాయి చిట్టికి. అమ్మమ్మ గబగబా పంచలో బల్లలమర్చి కాగితం పరచి అరిటాకులుంచి, మంచి నీళ్ల గ్లాసులుంచింది. భోజనానికొచ్చిన బంధువులు వడ్డన చేశారు. రెండోసారీ వడ్డించారు. భోజనం రుచిగా వున్నది.

తర్వాత విశ్రాంతి. తల్లి కామేశ్వరమ్మ లెక్క చెపుతుంటే కుసుమ వ్రాసుకుని కూడింది. ట్రావెలింగ్ అలవెన్సు గూడా వేసి కూడి అన్నప్రాశనకైన ఖర్చంతా సంచీలో పెట్టి తల్లికందించింది. తల్లి తృప్తిపడింది. అయిద్దైంది. కాఫీ అల్పాహారం ముగిశాయి. బంధువులు వెళ్లిపోయారు. సుమతి అన్నది ''వెళ్తామత్తయ్యా. సరదాగా గడిపాము. నా స్టూడెంట్సూ సంతోషించారు''.

''అదేం మాటే పిచ్చి పిల్లా. నాతో రండి. దగ్గర వూళ్లోనే బావ నరహరికి వుద్యోగం. వాడి పెద్ద కొడుక్కి ఒడుగు చేస్తాం. అదీ చూస్తారు నీ స్టూడెంట్సు. తరచూ రారుగా యింత దూరం! నేనూ నరహరి బావ గూడా బయలుదేరుతున్నాం. వాడికి శలవులేదు. మళ్లా అల్లుడొచ్చి విసుక్కుని దెప్పుతాడంతేగా సంబడం. సొమ్ము ఖర్చు చేయిస్తానని యేడుపు. కట్టుకు పోతామా! వేడుకలు చేసుకోరాదా? తనవారు చేసుకోటం లేదూ! అడ్డుపడ్డాడా? తిరుపతిలో దైవసన్నిధానంలో చేస్తేగాని ఒడుగ్గాదా. ఫామిలీ అంతా వెళ్లారు''.

బయలుదేరారు. ఖబుర్లాడుతూనే ఖర్చు చేయించింది. గమ్యం చేరి త్రెడ్ సెరిమొనీ చూశారు. ఫొటోలు తీశారు. భిక్ష చదివించారు. విందు భోజనం చేశారు. వూరూ పొలాలు చూశారు.

మూడవనాడు పొద్దున్నే హడావుడి చేసింది కామేశ్వరమ్మ. కాలకృత్యాలూ కాఫీ ఫలహారాలు అయాయి. మళ్లా ఆహ్వానించింది కామేశ్వరమ్మ.

''వెళ్ళొచ్చులేవే సుమతీ! వుద్యోగ మెక్కడికీ పారిపోదు. పెద్ద వొయ్యాయి సత్యవతి కూతురు, మీనాకి రేపు శోభనం. రాత్రి ఫోనొచ్చింది. చదువుతుండగానే మూడుముళ్లూ వేయించారు. డిగ్రీ తెచ్చుకోగానే తీసికెళ్తామన్నారు అత్తారు. మీనాకి

పద్దెనిమిదేళ్లే. ఈ రోజుల్లో ఆ యీడు పిల్లలకి పెళ్లిళ్లే స్థిరపడటం లేదు. కట్నాలు చుక్కల వేపు పరుగెడుతున్నాయని, నేను వూదరపెడితే, కాళ్లకాడికొచ్చిన బేరం, కాశిబోయినా రాదు, వాళ్లే పిల్ల నివ్వమని అడుగుతున్నారంటే తక్కువ అడుగుతారు, చేయిదాటి పోనీకు. చంద్రుడల్లే వుంటాడబ్బాయి. బ్రూక్‌బాండు కంపెనీలో జాబ్. ఒక్కడే కొడుకు. ఆడ పిల్లలకి పెళ్లిళ్లయి పోయి అత్తారిళ్ల కెళ్లారు. మేడా, కారూ వంట మనిషి, కుక్క, గేదెలు, ఆవులూ వున్నాయి. పిల్ల సుఖపడుతుందని తెలియజెపితే సత్యవతి ఒయ్యాయి మొగుణ్ణి ఒప్పించింది. అల్లుడేమో అంతివ్వలేమని గునిశాడు గానీ, నా కూతురు తనమాటే నెగ్గించుకున్నది'' అని మనిషి కళ్లూ చేతులూ తిప్పుతూ కదుల్తూ చెపుతుంటే, స్టూడెంట్సు వీడియో చిత్రం తీశారు. వాళ్లను చూసి నవ్వింది అత్తయ్య.

''ఇప్పుడా శోభనం వేరుగా చేసే ఆచారం యెవరూ పాటించటం లేదే? ఒడుగే విడిగా చేయటం లేదు. పెళ్లిలోనే చేసేస్తున్నారు. నేనే ఒప్పించా. మొదటి బిడ్డ ఒక్కతే కూతురు. వేడుకలు చేయవా? లేనిదానవా? అన్నా'' ''నిజమే'' అన్నది ఒయ్యాయి.

సుమతి స్టూడెంట్సు వంక చూస్తే, ''పోదాం మేడమ్'' అన్నారు. ''ఎక్స్‌కర్షన్ అందాము. తరచూ రాముగా'' అన్నారు.

అత్తయ్య లోపలి కెళ్లి పెట్టేబేడా తెచ్చే లోపల సుమతి ''డబ్బున్నదా? యింకా వదుల్తుందేమో!'' అన్నది రహస్యంగా.

''డోంట్ వర్రీ మేడమ్. ఫిల్మ్‌కెళ్తే వదలటం లేదూ? యెంటర్‌టెయిన్‌మెంట్ చూస్తున్నాం'' అన్నారు.

3

శోభన కార్యక్రమంలో పురోహితుడు మంత్రాలూ, ప్రెజెంట్సూ, విందూ ఫిల్మ్ తీశారు. సైట్ సీయింగ్ కానిస్తూ ఫొటోలు తీశారు. జోక్సు విన్నారు. సరసాలు చూశారు. అందరూ ఫ్రెండ్లీగా వుండి విట్టీగా మాట్లాడుతుంటే యెంజాయ్ చేస్తూ మంచి తెలుగు విన్నారు. రాత్రి పడి శోభనం పెళ్లికూతుర్ని గదిలోకి పంపేవరకు వీడియో మెషీన్ పనిచేస్తూనే వున్నది.

పొద్దున్నే కాలకృత్యాలు, స్నానపానాదులు, ఫలహారాలు కాగానే బయలుదేరారు. అత్తయ్య వెనక్కి వెళ్తుంటే టియె అచ్చుకున్నాడు. ఆమె నవ్వుతూ మోడరన్ లేడీలాగా థాంక్సు చెప్పింది.

సుమతీ ఆమె స్టూడెంట్సూ ఆదివారం యిళ్లకు చేరారు. రెస్ట్ తీసుకుని సోమవారం పదిన్నరకి రొటీన్ వర్క్ అందుకున్నారు.

జోజెఫ్ నవ్వుతూ అన్నాడు ''అభినయం, అభినేత్రి అనేవి ప్రాక్టికల్‌గా గూడా అర్థమయాయి మేడమ్. మీ ఆంట్ అభినయానికి మెచ్చి, పర్ఫెక్ట్‌గా చేశారని పే చేశాం మేడమ్. సింప్లీ ఫర్ ఫన్. యెంత పే చేశామని లెక్క రాసి కూడాము. టోటల్ ఫైవ్ థౌజండ్ అయింది. యాక్షన్ పేకింగ్ ఫిల్ము చూస్తున్నట్లు ఆమె అభినయాన్ని యెంజాయ్ చేశాము మేడమ్. యెక్కడికక్కడే డబ్బున్నట్టూ నటిస్తూ మాట్లాడుతూ కొంగువిప్పుతూ, చిల్లరుందా అంటూ, నేర్పుగా మాచేతే ఖర్చు పెట్టించారు మీ ఆంట్. తన డబ్బు ఖర్చు చేయనే లేదు మిసెస్ కామేశ్వరమ్మ మీ ఆంట్. మరి మీ సిస్టరిన్లాస్ నించి యెంత గుంజారో తెలీదుగాని తీసుకుంటున్నప్పుడు ఫిల్ము తీశాము. నవ్వుతూ బిడియం లేకుండా మా వంక

చూశారు మీ ఆంట్. గర్వంగా గూడా ఫోజు పెట్టారు. ఆంటీ గొప్ప అభినేత్రి. యాక్ట్రెస్. కళలు నిమిషంలో మారుస్తారు. రిహార్సల్సుతో అవసరం లేదు. చూడండి మేడమ్. మెషీన్ తెచ్చాను'' అని ఆన్ చేసి సుమతికి ఇచ్చాడు జోజిఫ్. నిదానంగా కుర్చీలో కూచుని ఫిల్మంతా చూసి యెంజాయ్ చేసింది సుమతి. మెషీనిచ్చేసింది.

''థాంక్స్. చాలా శ్రమించావు జోజిఫ్. మా ఆంట్ కిచ్చిన కాంప్లిమెంటుకి థాంక్స్. డైలాగ్సు అర్థమైనై?'' అనడిగింది.

'' ఆ. ఆ. డబ్బు లాగటానికే, వదిలించటానికే, శక్తియుక్తులూ, అభినయం అప్లై చేస్తుందని అండర్స్టుడ్. ఆమె సనిన్లా ట్రూత్ చెప్పారుగా! ఆ హంగామా అంతా తాను ఖర్చు పెట్టటానిక్కాక, ఖర్చు చేయించటానికేనని తేలింది మేడమ్''.